# వ్యాస కౌముది



## నలోపాఖ్యానం
## దమయంతీ స్వయంవరము

– **కౌటిల్య చౌదరి**

(క్రిందటి సంచిక నుంచి కొనసాగింపు)

నలదౌత్యం ముగిసింది. దమయంతి ఆతణ్ణి తప్ప అన్యులని వరించనని స్థితప్రజ్ఞతతో చెప్పింది...

**అంత పుణ్యతిథినక్షత్ర ముహూర్తంబున దమయంతీ స్వయంవరంబు ప్రవర్తిల్లిన -** అలా దమయంతీ స్వయంవర తిథి రానే వచ్చింది. ఈ దేవతలని దమయంతి వరించనని చెప్పిందాయెను. ఇక ఏం చేశారూ!

**నలున కాని నలినదళ నేత్ర వరియింప**
**దట్టి చూత మనుచు నమరవరులు**
**నలువురును గడంగి నలరూపముల వచ్చి**
**రాస్వయంవరమున కతిముదమున.**

ఈ దమయంతి నలుని తప్ప వరించనంటోంది, ఎలాగో మనమూ చూద్దాం అనుకున్నారు. దేవతలు కామరూపధారులు కదా! నలుగురూ నలుడి రూపాన్ని ధరించి స్వయంవరానికి వచ్చారు. ఎందుకూ! అల్లా వస్తే ఎవరో ఒకర్ని వరిస్తుందికదా అన్న ఆశ! ఇరవైశాతం ఛాన్సన్నమాట!..:) అది కూడా వదులుకోవడం ఎందుకూ అనుకున్నారేమో!

నన్నయ్యగారు స్వయంవర ఘట్టాన్ని అంత విపులంగా చెప్పరు. నాలుగైదు పద్యాల్లో తేల్చేస్తారు. కాని ఆ నాలుగైదు పద్యాల్లోనే ఆయన వాడిన పదాల్లో ఇమిడ్చిన లోతైన భావాలు చెప్పుకోవాలంటే పెద్ద వ్యాఖ్యానాలే తయారవుతాయి. అదీకాక, నన్నయ్యగారు పూర్వభాగానికి అంత ప్రాముఖ్యం ఇవ్వరు. ఆయన ప్రాముఖ్యం అంతా దమయంతీదేవి పడ్డ కష్టాల గురించే! అందుకే నలోపాఖ్యానం మొత్తం కరుణరస ప్రధానంగా తీర్చారు నన్నయ్యగారు.......

కాని, స్వయంవర వేడుకలు అసలు ఎలా జరుగుతాయి, ఆ పద్ధతులూ, సంప్రదాయాలూ విపులంగా చర్చిద్దామన్న ఉద్దేశంతో ఈ భాగాన్ని కొంచెం ఎక్కువగా పెంచి విపులంగా రెండు భాగాలుగా రాస్తాను. శ్రీహర్షుడు నైషధంలో మొత్తం ఆరుసర్గలలో విపులంగా వర్ణిస్తాడు స్వయంవర ఘట్టాన్ని. శ్రీనాథుడు కూడా దానిననుసరించే అటూఇటూగా రెండాశ్వాసాలు మొత్తం స్వయంవర వర్ణనమే! వాటిల్లో ముఖ్యమైన అంశాలు చెప్తాను.

స్వయంవరానికి సకల భూమండలంలో రాజులూ,రాజకుమారులూ విచ్చేశారు.

**రాజవంశజుడై యుండి రానివాడు**
**కామబాణంబులకు గుఱిగానివాడు**

**సప్తసాగర మధ్య భూచక్రమునను**
**నృపకుమారుండు లేడు**
**పన్నిదమునకును.{శృం.నై}**

అల్లా వచ్చిన రాజసందోహంతో కుండిన నగరమంతా నిండిపోయిందట! నువ్వులు పైన వేస్తే కిందకు రాలేటంత ఎడం కూడా లేకుండా ఉన్నదట! మరి రాజులు ఒంటిగా రారుకదా, కూడా సైన్యమూ, పరివారమూ! ఇక రాచవీధులన్నీ కిక్కిరిసిపోయాయి. ఎవడు ముందు చొరబడితే వాడికే దమయంతి దక్కుతుందన్నట్టు నెట్టుకుంటూ ఉన్నారట!అసలు ఈ వచ్చిన వాళ్ళంతా నిజంగా దమయంతి తమని వరిస్తుందన్న ఆశ ఉన్నవాళ్ళేనా! కాదట!

**కొందఱు తరుణి వరింపం,**
**గొందఱు బలిమిని హరింపఁ,గొందఱు సూడన్**
**గొందఱు భూషింపను, నృప**
**నందను లేతెంచిరుబ్బున న్మహమునకున్.{శృం,నై}**

అదన్నమాట సంగతి! ఒక్కోడిదీ ఒక్కో వ్యాపకం, ఒక్కో కారణం......

ఇంకా ఒక్క రాజకుమారులేనా వచ్చింది. పైలోకాల్నుంచి దేవతలూ వచ్చారు. ఇంకా కిందిలోకాల్నుంచి కూడా వచ్చారట! ఎవరూ! **కోటి భుజంగ పుంగవులు గొల్వగ,......... కర్కోటకుడేగుదెంచె మద ఘూర్ణిత పాటల నేత్రపద్ముడై** - కర్కోటకనాగుడొచ్చాడట, ఫణ సంభృత రత్నదిశా విభాసియై. ఆయన కన్నులెలా ఉన్నాయయ్యా అంటే, గర్వంతో ఎరుపెక్కి, ఎరుపూ,తెలుపూ కలిసిన వర్ణంలో కనిపిస్తున్నాయట! ఇంకా, వాసుకి వచ్చాడు, ఫణాపర్యంత మాణిక్య మంజు మయూఖాంకుర పుంజ మంజుల నభస్కుడై, భుజంగాంగనలు ఇరుపక్కలా యశఃగీతికలు పాడుతుండగా విచ్చేశాడు.......

ఇంద్రాగ్ని యమవరుణులూ విచ్చేశారు. తక్కిన దిక్పాలకులు రాలేదు. ఎందుకూ? స్వయంవరం కదా, రాజ పురోహితులు మంత్రోక్తంగా అసురీశక్తులు చొరబడకుండా దిగ్బంధం చేశారు. అందువల్ల నైరుతి దిక్పాలకుడైన నిరుతి( ఈయన రాక్షసుడు) రావీలు లేకపోయింది. వాయుదేవుడెందుకు రాలేదూ! ఆయన వాహనమైన లేడి రానన్నదట. ఎందుకో మరి! ఏమిటోయ్ నీ సంగతీ అంటే, "నా చూపులకన్నా ఆ దమయంతి చూపులే బహు సుందరంగా ఉన్నాయని అందరూ పొగుడుతున్నార"ని స్పర్థపూనిందట. మరి ఉత్తర దిక్పాలకుడైన కుబేరుడు ఎందుకు రాలేదుటా? దారిలో వస్తూ వస్తూ కైలాస పర్వతంలో తన ప్రతిబింబం చూచుకున్నాడట. పర్వతంలో ప్రతిబింబం చూచుకోటమేంటా అనుకుంటున్నారా? అవును మరి, కైలాస పర్వతం వెండి, శుద్ధస్ఫటికంతో నిండి ఉంటుంది. {రజతాద్రిస్తు కైలాసో అష్టాపదఃస్పటికాచలః} కాబట్టి కైలాసానికి దర్పణంగా ఉపయోగం చెప్పబడింది. ఎల్లా కనపడిందట ప్రతిబింబం. ఈయన కురూపట! కుబేరః - కుత్సితం బేరం శరీరం యస్య సః కుబేరః, కుత్సితమైన శరీరము కలవాడు అనివ్యుత్పత్తి. ఎలాంటి రూపం అది, "మన్దాక్షం హ్రీ స్త్రపా వ్రీడా లజ్జా"- మూడు పాదాలు, ఎనిమిది దంతాలు, మెల్లకన్ను - ఈ రూపం గౌరీదేవి శాపం వల్ల కలిగింది. మరి ఇల్లాంటి రూపం ఉన్నదని చూసుకున్నాక ఎల్లా వెళ్ళబుద్ధవుతుంది మరి!?

ఇక ఈశానుడు అర్థనారీశ్వరుడు కదా! ఆయన వెళ్దామని బైల్దేరి ముందుకు నడిచినా, ఆవిడ వెనక్కు లాగుతుంది కదా, వెళ్ళటం పడదు. అందువల్ల ఎందుకు అనవసరమైన శ్రమ అని ఊరుకున్నాడట. తాను వహిస్తున్న భూమిభారం మొయ్యను వేరెవ్వరూ లేరులే అని ఆదిశేషుడు రాలేదు. ముదిసిపోయిన వయసులో పెండ్లికి మొహంవాయటం మంచిదికాదని పితామహుడు వద్దులెమ్మని మానుకున్నాడట! {ఇది శ్రీనాథుడు వాడిన ప్రయోగం. ఇక్కడ హర్షుడు "పితామహ"శబ్దం వల్ల బ్రహ్మ దమయంతి తండ్రికి తండ్రి అన్న ఉపమానంలో చెప్పి, సపిణ్ణుడు-సమాన దేహుడు, సమానగోత్రుడు, అవుతాడు కాబట్టి వివాహానికి తగదని మానుకున్నాడని చెప్తాడు.}

అలా త్రిలోకవాసులూ ఏతెంచారు.

ఇంద్రాగ్నియమవరుణులు ఎల్లా వచ్చారు? నలుడి రూపం ధరించి వచ్చారు. కాని, ఆ నలుని రూపం ధరించటానికి ఎంతో ప్రయాస పడ్డారు. ఎంత చేసినా నలుడి రూపం సంతృప్తికరంగా పొందలేకపోతున్నారట. లోకసామాన్యంగా, స్వాభావికంకన్నా కృత్రిమం ఎప్పుడూ భిన్నంగానే ఉంటుంది, ఎంత ప్రయాసపడి సామ్యం తెద్దామనుకున్నా. నలుడితో సామ్యం పొందటానికి ఒక్కో శరీరభాగాన్ని మార్పు చేసుకున్నారట. ముఖాన్ని ఒకసారి పూర్ణచంద్రుడిలా, ఒకసారి వికసించిన పద్మంలా చేసుకు చూసుకుని ఎంతకూ సామ్యం రాకపోవటం వల్ల విసుగెత్తి, ఆ చూసుకున్న అద్దాలు పగులగొట్టారట.

హర్షుడు ఇన్ని శ్లోకాల్లో చెప్పిన దేవతల ఈ శ్రమనీ, విఫలప్రయత్నాలనీ నన్నయ్యగారు "కడంగి" అన్న చిన్నమాటతో తేల్చేస్తారు. {మొదట చెప్పిన పద్యం...కడంగి అంటే మిక్కిలిప్రయత్నం అని అర్థం}. వాళ్ళు ఎంత ప్రయాసపడ్డారో ఆ చిన్న పదంలో మనకు అవగతమవుతుంది. చిన్న పదాలలో మహార్థాలని ఇముడుస్తారు. అదీ నన్నయ్యగారి ప్రతిభ!

●●●

*(కొనసాగింపు వచ్చేసంచికలో)*

Click here to share your comments on this story.